సాక్షి
అనంతపురం

గురువారం । 1 । మే । 2025



● శ్రామికుడా వర్ధిల్లు

నేడు శ్రామికుల పండుగ మేడే.. వాడవాడలా వేడుకల నిర్వహణకు సిద్ధమయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

గరిష్టం/కనిష్టం
41.2°/22.9°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

మద్యానికి పచ్చ ధర

పైసల కోసం ఎంతకైనా దిగజారే 'పచ్చ'మంద... మందుబాబుల జేబుకు చిల్లు పెడుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లిక్కర్ 'సిండికేట్' నడిపిస్తూ అనధికారికంగా అడ్డగోలుగా రేట్లు పెంచేసింది. ఇప్పటికే తాడిపత్రి, హిందూపురంలో బాటిల్ మూత తీయకుండానే మందుబాబులకు 'చుక్కలు' కనపడుతుండగా.. అనంతపురంలోనూ అదే సీన్ కనిపించబోతోంది.



2024 సెప్టెంబర్ 15 నుంచి ఇప్పటివరకూ మద్యం వివరాలు ఇలా

అనంతపురం జిల్లాలో మద్యం షాపులు	136
ఇప్పటివరకూ మద్యం అమ్మకాలు (లీటర్లలో)	76,93,128
ఇప్పటివరకూ బీర్ల అమ్మకాలు (లీటర్లలో)	28,94,460
మద్యం, బీర్ల అమ్మకాల విలువ	రూ.617,82,01,056
శ్రీసత్యసాయి జిల్లాలో మద్యం షాపులు	69
ఇప్పటివరకూ మద్యం అమ్మకాలు (లీటర్లలో)	47,00,097
ఇప్పటివరకూ బీర్ల అమ్మకాలు (లీటర్లలో)	17,26,357
మద్యం, బీర్ల అమ్మకాల విలువ	రూ.367,21,78,984

సిండికేట్.. 'ఎల్లో' రేట్

- ఇప్పటికే తాడిపత్రి, హిందూపురంలో ఎమ్మార్పీకి మంగళం
- బ్రాండ్‌ను బట్టి భారీగా ధర పెంచిన వైనం
- హిందూపురంలో బాలకృష్ణ పీఏల కీలక పాత్ర
- అనంతపురం అర్బన్‌లో సిండికేట్‌కు నేడో రేపో అనుమతి
- ధరలు పెంచుకునేందుకు ఒక్కో షాపునకు రూ.75 వేలు ఫిక్స్
- చీప్ లిక్కర్, బీర్లు ఎక్కువ ధరకు అమ్మేందుకు అనుమతి
- క్రమంగా మిగతా బ్రాండ్‌ల రేట్లు పెంచుకునేందుకు ప్లాన్
- ఎమ్మెల్యేల ప్రమేయంతో కిమ్మనని ఎక్సైజ్ అధికారులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు అమలు చేస్తున్న మద్యం పాలసీ సామాన్య, మధ్య తరగతి ప్రజలను నిండా ముంచుతోంది. ముందుగా మద్యం ధరలు తగ్గించామని చెప్పినా... ఆరుమాసాలు తిరగకుండానే మద్యం ధరలు ఆమాంతం పెంచారు. ఇప్పుడేమో మద్యం షాపుల నిర్వాహకులే పెంచుకునేలా అనధికార ఏర్పాట్లు జరుగుతున్నాయి. బెల్టుషాపుల నిర్వహణ ద్వారా పల్లెల్లో ఒక్కో క్వార్టర్‌పై ఇప్పటికే రూ.20 అదనంగా పిండుకుంటున్నారు. మద్యం షాపులన్నీ కూటమి ఎమ్మెల్యేలవి కావడం...బెల్టుషాపులన్నీ ఎమ్మెల్యేల అనుచరులే నిర్వహిస్తుండటంతో ధరలు ఎంత పెంచుకున్నా అడిగే నాథుడే లేకుండా పోయారు.

తాడిపత్రిలో డబుల్‌రేటు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని తాడిపత్రి, హిందూపురం నియోజకవర్గాల్లో 'సిండికేట్' లిక్కర్ ధరలు పెంచేసింది. కొన్ని బ్రాండ్ల రేట్లు డబుల్ చేసింది. దీంతో తాడిపత్రిలో ఓ మద్యం ప్రియుడు ఎక్కువ ధరలకు ఎందుకు అమ్ముతున్నారని అడగ్గా..'నీ యిష్టమైతే కొను... లేదంటే వెళ్లిపో' అంటూ మద్యం దుకాణం నిర్వాహకుడు మాట్లాడిన వాయిస్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. రాజకీయ జోక్యం కారణంగా ఎక్సైజ్ అధికారులు ఆ మద్యం షాపుల వైపు కన్నెత్తి చూసే ధైర్యం కూడా చేయలేకపోతున్నారు.

హిందూపురంలో రేటు ఫిక్స్..

ముఖ్యమంత్రి బావమరిది బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురంలో మూడు నెలల కిందటి నుంచే అధిక ధరలకు మద్యం అమ్ముతున్నారు. లిక్కర్ రేటు ఫిక్స్ చేయడంలో బాలకృష్ణ పీఏలు కీలక పాత్ర పోషించినట్టు విమర్శలున్నాయి. రూ.120 చీప్ లిక్కర్ క్వార్టర్‌పై రూ.10, బీర్ పైన రూ.10 నుంచి రూ.15 ఎక్కువ తీసుకుంటున్నారు. త్వరలోనే మిగతా బ్రాండ్‌లపైనా అదనపు ధరలు నిర్ణయించనున్నట్టు తెలిసింది.

ఇద్దరు అధికారులూ అంతే..

శ్రీసత్యసాయి జిల్లాలో ఎక్సైజ్ అధికారులు ఇద్దరు మామూళ్ల మత్తులో జోగుతూ ఏం జరిగినా మా పరిధి కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు. అనంతపురంలో ఓ వెలుగు వెలిగి పదోన్నతిపై శ్రీసత్యసాయి జిల్లాకు వెళ్లిన అధికారితో పాటు మరో బాసు ఇద్దరూ ఒక్కో మద్యం షాపు నుంచి నెలకు రూ.20 వేలపైనే వసూలు చేస్తున్నట్టు విమర్శలున్నాయి. బార్ల నుంచీ నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారు.

అనంతపురం అర్బన్‌లోనూ రంగం సిద్ధం..

అనంతపురం నగరంలో లిక్కర్ సిండికేట్‌కు ముమ్మర యత్నం జరుగుతోంది. నాలుగైదు రకాల బ్రాండ్‌లపై ఎక్కువ ధరలు వసూలు చేసుకునేందుకు ఓ ప్రజాప్రతినిధి సిండికేట్‌కు రావాలని అందరినీ పిలిచినట్టు తెలిసింది. సిండికేట్ చేసినందుకు ఒక్కో షాపు నెలకు రూ.75 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఓ మద్యం షాపు నిర్వాహకుడు చెప్పారు. త్వరలోనే ఇది ఫైనల్ కావచ్చని తెలుస్తోంది. దీన్నిబట్టి ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా అనధికారికంగా మద్యం ధరలు అమలు కానున్నాయి. దీనిపై ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య వివరణ కోరేందుకు యత్నించగా ఆయన స్పందించలేదు.

న్యూస్‌రీల్

బసవేశ్వరుని జీవితం ఆదర్శప్రాయం

- కలెక్టర్ వినోద్‌కుమార్



బసవేశ్వరుని చిత్రపటానికి నమస్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, డీఆర్‌ఓ మలోల

అనంతపురం అర్బన్: సమాజోద్ధరణకు కృషి చేసిన మహనుభావుడు బసవేశ్వరుడు అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. ఆయన జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో బసవేశ్వరుని 894వ జయంతి నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై బసవేశ్వరుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బసవేశ్వరుడు కవి, ఫిలాసఫర్, గురువు, సంఘ సంస్కర్తగా కీర్తింపబడ్డారన్నారు. సమాజం గురించి, మనిషి జీవితమంటే ఏమిటి, ఏమి సాధిస్తే శాంతిని పొందుతారనే విషయాలు చెప్పారన్నారు. ఉత్తర కర్ణాటకలో ఊరూరా పర్యటించి సమాజాన్ని సరిదిద్దే కార్యక్రమం చేపట్టిన మహనుభావుడన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎ.మలోల, జిల్లా టూరిజం అధికారి జయకుమార్‌బాబు, డీపీఓ నాగరాజునాయుడు, జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, వీరశైవ లింగాయత్ నాయకులు రాజు, సతీష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి ఎలుగుబంటి



దేవీరమ్మ కాలనీలో సంచరిస్తున్న ఎలుగుబంటి

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం పట్టణ శివారు ప్రాంతాలలో ఎలుగుబంటి సంచారం స్థానికులను భయాందోళనకు గురి చేస్తోంది. మంగళవారం రాత్రి దేవీరమ్మ కాలనీలోని జనావాసాల్లోకి ఎలుగుబంటి రావడంతో స్థానికులు ఆందోళన చెందారు. యువకులు గట్టిగా కేకలు వేయడంతో అది ఇళ్ల ముందు నుంచి సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. కళ్యాణదుర్గం రూరల్ పోలీసు స్టేషన్‌కు సమీపంలో అటవీ ప్రాంతం ఉంది. దీంతో ఎలుగుబంట్లు, చిరుతలు సైతం జనావాసాల్లోకి వస్తున్నట్లు స్థానికులు తెలిపారు. రాత్రి అయ్యిందంటే ఏదో ఒక అడవి జంతువు వస్తుండటంతో బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోందని స్థానికులు వన్నూరుస్వామి, రామాంజినేయులు, బాషా తెలిపారు. కూతవేటు దూరంలోనే అటవీ శాఖ కార్యాలయం ఉన్నా ఎలాంటి రక్షణ చర్యలూ చేపట్టడం లేదని వారు వాపోయారు.

శింగనమలలో టైప్-4 కేజీబీవీ



శింగనమలలోని టైప్-4 కేజీబీవీ భవనం

అనంతపురం ఎడ్యుకేషన్: పేద విద్యార్థినులకు జిల్లాలో మరొక వసతిగృహం అందుబాటులోకి వచ్చింది. దాదాపు ఏడేళ్ల కిందట జిల్లాకు నాలుగు టైప్-4 కేజీబీవీలు (వసతి గృహాలు మాత్రమే) మంజూరయ్యాయి. శింగనమల, నార్పల, కుందుర్పి, బొమ్మనహాళ్‌లో ఏర్పాటు చేసేలా ఉత్తర్వులిచ్చారు. ఇందులో ఇప్పటికే భవన నిర్మాణం పూర్తయిన నార్పలలో బాలికల బీసీ గురుకుల పాఠశాలకు కేటాయించారు. తాజాగా శింగనమలలో భవన నిర్మాణం పూర్తి కావడంతో ఈ ఏడాది నుంచి అందుబాటులోకి తెస్తున్నారు. శింగనమలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న 110 మంది విద్యార్థినులకు వసతి కల్పించనున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ టి.శైలజ తెలిపారు. ఇక కుందుర్పి, బొమ్మనహాల్ మండలాల్లో టైప్-4 కేజీబీవీలు నిర్మాణ దశలో ఉన్నాయి.

దరఖాస్తు గడువు పెంపు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని కేజీబీవీల్లో నాన్‌టీచింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు గడువును ఈ నెల మూడు వరకు పొడిగిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా మండలాల విద్యాశాఖ అధికారుల కార్యాలయాల్లో మూడో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఎంఈఓలను సంప్రదించాలన్నారు.

3 నుంచి గ్రూప్-1 మెయిన్స్

- రెండు పరీక్ష కేంద్రాలు.. 594 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లు పకడ్బందీగా చేయండి : కలెక్టర్

అనంతపురం అర్బన్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈ నెల మూడో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై బుధవారం కలెక్టర్ తగిన ఆదేశాలు, సూచనలను అధికారులకు ఇచ్చారు. అనంతపురంలోని రెండు కేంద్రాల్లో ఏడు రోజుల పాటు జరగనున్న పరీక్షలకు 594 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. పరీక్షలకు కోఆర్డినేటింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, లైజన్ అధికారులుగా డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, మల్లికార్జునరెడ్డి వ్యవహరిస్తారన్నారు. యూపీఎస్సీ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పరీక్షల ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డుతో పాటు ఏదేని గుర్తింపు కార్డు తీసుకు రావాలన్నారు. సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులను కేంద్రంలోకి అనుమతించబోరన్నారు. నిర్ణీత సమయానికి గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్..

అభ్యర్థులకు ఏదేని సమాచారం, ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. గురువారం నుంచి 9వ తేదీ వరకు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కంట్రోల్ రూమ్ పనిచేస్తుంది. అభ్యర్థులు 85002 92992 (వాట్సాప్), 08554-220009కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చు.

పరీక్షా కేంద్రాలు

- పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఆలమూరు రోడ్డు, రుద్రంపేట
- శ్రీబాలాజీ పీజీ కళాశాల, ఆలమూరు రోడ్డు, రుద్రంపేట.

మెడికో ఆశలను చిదిమేసిన రోడ్డు ప్రమాదం

- నెల్లూరు జిల్లాలో ప్రమాదం.. ధర్మవరం విద్యార్థి మృతి
- సెంట్రింగ్ పనులు చేస్తూ కుమారుడిని ఎంబీబీఎస్ చదివిస్తున్న తండ్రి
- కుమారుడి మృతివార్త విని తల్లడిల్లిన నిరుపేద కూలీ



నరేష్‌నాయక్ (ఫైల్)



నిర్మానుష్యంగా మారిన లోనికోట వార్డు

ధర్మవరం: సెంట్రింగ్ పనులు చేసే అతను..తన పిల్లలు తనలా కూలి పనులు చేయకూడదని భావించాడు. రెక్కలకష్టంతోనే కుమారుడు, ఇద్దరు కూతుళ్ల భవితకు బాటలు వేస్తున్నాడు. నిరుపేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో కుమారుడిని ఎంబీబీఎస్ చదివిస్తున్నాడు. తెల్లకోటు వేసుకుని మెడలో స్టెత్‌తో కనిపించాల్సిన కుమారుడిని తెల్లబట్టలో చుట్టి కళ్లముందు పెట్టడంతో ఆ తండ్రి బోరున విలపించాడు.

కుమారుడిని డాక్టర్‌గా చూడాలని..

ధర్మవరం లోనికోటకు చెందిన నవదీయ కేశవనాయక్ సెంట్రింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. అతనికి కుమారుడు నరేష్‌నాయక్(23), ఇద్దరు కూతుళ్లు గాయత్రి, నందిని సంతానం. కుమారుడు నరేష్‌నాయక్‌ను ఉన్నత స్థానంలో ఉంచాలని భావించాడు. ఈక్రమంలోనే నారాయణ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో చేర్పించాడు. కుమార్తె గాయత్రి బీటెక్, మరో కుమార్తె నందిని ఇంటర్ చదువుతోంది. ప్రస్తుతం నరేష్ నాయక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తన కుమారుడు వైద్య పట్టా అందుకుంటే తమ కుటుంబం కష్టాలన్నీ తొలగిపోవడంతో పాటు సమాజానికి తన వంతుగా ఓ మంచి వైద్యుడిని అందించినవాడిని అవుతానని కేశవనాయక్ అనుకునేవాడు. ఇదే విషయాన్ని తన స్నేహితులతో తరచూ చెప్పుకునేవాడు. కానీ అతని ఆశలపై విధి నీళ్లు పోసింది. బుధవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం సమీపంలో జాతీయ రహదారిపై కారు బోల్తా పడిన ప్రమాదంలో నరేష్‌నాయక్ మృతి చెందాడు. కుమారుడి మరణవార్త తెలియగానే కేశవనాయక్ కాళ్ల కింద భూమి కంపించింది. వైద్యుడిగా తెల్లకోటుతో వస్తాడనుకున్న కుమారుడిని తెల్లబట్టలో చుట్టిపెట్టిన చిత్రాలను చూసి శోకసంద్రంలో మునిగిపోయాడు. మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు నెల్లూరుకు వెళ్లాడు. దీంతో లోనికోటలో విషాద ఛాయలు అలముకున్నాయి.

తెలంగాణ సీఎం పీఎస్‌గా శ్రీనివాసరాజు

- ఏపీఆర్ఎస్ పూర్వ విద్యార్థికి దక్కిన గౌరవం



కేఎస్ శ్రీనివాసరాజు

పరిగి: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రిన్సిపల్ సెక్రెటరీగా కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్ పూర్వ విద్యార్థి కేఎస్ శ్రీనివాసరాజు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గం పుత్తూరు మండలంలోని ఈసలాపురం గ్రామానికి చెందిన కేఎస్ శ్రీనివాసరాజు 1976లో ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లిలో 8వ తరగతిలో ప్రవేశం పొందారు. 1978–79 విద్యాసంవత్సంలో పదో తరగతి పూర్తి చేశారు. అనంతరం ఎస్వీ యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేసిన ఆయన... గ్రూప్–1 ఆఫీసర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. అంచలంచెలుగా ఎదుగుతూ ఐఏఎస్ దక్కించుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీగా పని చేశారు. ఆ తర్వాత తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో 2011 నుంచి దాదాపు 99 నెలల పాటు జేఈఓగా పనిచేసి రాష్ట్రంలోనే ఖ్యాతి గడించారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణకు కేటాయించడంతో తెలంగాణ రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణపొందారు. ఆ తర్వాత 2024 జూలై నుంచి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా పనిచేశారు. తాజాగా తెలంగాణ సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీగా నియమితులయ్యారు.



భక్తజనం మధ్య కొనసాగుతున్న వేంకటేశ్వరస్వామి రథోత్సవం

నమో వేంకటేశా..



శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

బొమ్మనహాళ్: మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లో బుధవారం సాయంత్రం భక్త జనవాహిని మధ్య వేంకటేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు శ్రీవారిని పల్లకీలో ఆలయం చుట్టూ ఊరేగించి..తర్వాత రథంపై ఆశీనులు గావించారు. ఆలయ, గ్రామ కమిటీ సభ్యులు, భక్తులు స్వామివారి రథాన్ని లాగారు. ఆలయ ప్రాంగణం నుంచి ప్రధాన రహదారి గుండా వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణ మధ్య రథోత్సవం కొనసాగింది. రథం ముందు చిన్నారులు వివిధ వేషధారణలతో అలరించారు. భక్తులు కోలాటం, ఇతరత్రా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ నబీరసూల్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

కందిపప్పు లేనట్టే!

- మే నెలకూ అలాట్‌మెంట్ ఇవ్వని ప్రభుత్వం
- వరుసగా నాల్గో నెలా పంపిణీకి ఎగనామం
- 6.60 లక్షల మంది కార్డుదారులకు మొండిచెయ్యి
- పేదలపై రూ.16.64 కోట్ల అదనపు భారం





అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. చౌక దుకాణాల ద్వారా అందించే సరుకుల్లోనూ కోత పెడుతోంది. నెలకు కార్డుకు రూ.67తో కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉండగా.. ఫిబ్రవరి నుంచి పంపిణీ చేయడం లేదు. జిల్లాకు ప్రస్తుత మే నెలకు సంబంధించిన కందిపప్పు అలాట్‌మెంట్ కూడా ప్రభుత్వం ఇవ్వలేదు. దీంతో ఈ నెల కూడా ఎగనామమే అనేది స్పష్టమవుతోంది. కార్డుదారులు బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.130తో కొనాల్సి వస్తోంది.

పాత పాటే..

కందిపప్పు కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వ స్థాయిలో టెండర్ ప్రక్రియ నడుస్తోంది... అది పూర్తయితే అలాట్‌మెంట్ వస్తుందంటూ నాలుగు నెలలుగా అధికారులు చెబుతున్నారు. దీన్నిబట్టే పేదల సంక్షేమం విషయంలో ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో 1,645 చౌక ధరల దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 6,60,330 రేషన్ కార్డులు ఉన్నాయి. మొత్తం కార్డులకు సంబంధించి నెలసరి జిల్లాకు కందిపప్పు అలాట్‌మెంట్ 625 టన్నులు. కార్డుకు ఒక కిలో కందిపప్పు రూ.67తో ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. అయితే నాలుగు నెలలుగా పంపిణీ చేయకపోవడంతో కార్డుదారులు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు.

పేదలపై అదనపు భారం..

ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా కందిపప్పు నాలుగు నెలలుగా పంపిణీ చేయకపోవడంతో జిల్లాలోని పేదలు రూ.16.64 కోట్ల అదనపు భారం భరించారు. ప్రభుత్వం రూ.67తో ఇచ్చే కిలో కందిపప్పు నలుగురు లేదా ఐదుగురు ఉన్న ఒక కుటుంబానికి నెలంతా సరిపోతుంది. కానీ మార్కెట్‌లో కిలో రూ.130 ఉంది. ప్రభుత్వం ఇవ్వకపోవడంతో కిలోపై రూ.63 అదనంగా వెచ్చించి మార్కెట్‌లో కొంటున్నారు. తద్వారా జిల్లాలోని 6,60,330 కార్డుదారులు నెలకు రూ.4.16 కోట్లు.. నాలుగు నెలల్లో రూ.16.64 కోట్లు అదనపు భారం భరించాల్సిన పరిస్థితి వచ్చింది.

సజావుగా పాలిసెట్

- 88.75 శాతం హాజరు



పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు



పాలిసెట్ సందర్భంగా అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ కాలేజీ వద్ద సందడి

అనంతపురం: డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ పాలిసెట్ బుధవారం జిల్లా వ్యాప్తంగా సజావుగా సాగింది. మొత్తం 8,910 మంది విద్యార్థులకు గాను 7,908 మంది (88.75 శాతం) హాజరయ్యారు. బాలురు 5,351 మందికి గాను 4,819 (90.06 శాతం), బాలికలు 3,559 మందికి గాను 3,089 మంది (86.79 శాతం) హాజరయ్యారు. అనంతపురం, కళ్యాణదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించినట్లు పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ సి.జయచంద్రా రెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాలను పాలిసెట్ జిల్లా పరిశీలకులు డాక్టర్ ఎంవీ ఎస్ఎస్ఎన్ ప్రసాద్, అనంతపురం నగర పరిశీలకులు వై.సురేష్ పర్యవేక్షించారు.

ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్ల హేతుబద్ధీకరణ ప్రారంభం

అనంతపురం అగ్రికల్చర్: రైతు సేవాకేంద్రాల (ఆర్‌ఎస్‌కే)లో పనిచేస్తున్న వీఏఏ, వీహెచ్‌ఏ, వీఎస్‌ఏల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) ప్రక్రియ మొదలైంది. బుధవారం అనంతపురంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో రెండు జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ అధికారుల ఆధ్వర్యంలో పంటల విస్తీర్ణం ఆధారంగా ఈ ప్రక్రియను చేపట్టారు. జేడీఏలు ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు, ఉద్యానశాఖ డీడీలు ఫిరోజ్‌ఖాన్, చంద్రశేఖర్, పట్టుశాఖ జేడీలు పద్మమ్మ, ఆంజనేయులు, ఆయా శాఖల సూపరింటెండెంట్లు, టెక్నికల్ అధికారులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 856 ఆర్‌ఎస్‌కేలకు సిబ్బంది సర్దుబాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 2024 ఖరీఫ్, 2025 రబీ ఈ–క్రాప్ కింద నమోదైన వ్యవసాయ, ఉద్యాన, మల్బరీ పంటల విస్తీర్ణం ఆధారంగా ప్రాధాన్యత వారీగా కొనసాగిస్తున్న ఈ పక్రియ గురువారం పూర్తి కావచ్చునన్నారు.

హైఓల్టేజీతో విద్యుత్ ఉపకరణాల దగ్ధం

గుత్తి: స్థానిక ఎస్‌బీఐ కాలనీలో బుధవారం హై ఓల్టేజీ విద్యుత్ సరఫరా కారణంగా ఇళ్లలోని విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. దాదాపు పది ఇళ్లలో ఫ్యాన్‌లు, ఫ్రిజ్‌లు, మోటార్లు, టీవీలు దెబ్బతిన్నాయి. ఓల్టేజీలో హెచ్చుతగ్గులపై గతంలోనే విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామని ఈ సందర్భంగా కాలనీవాసులు తెలిపారు. అయినా ఎవరూ స్పందించకపోవడంతో నష్టపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

చిన్నారులపై కూటమి నిర్దయ

- అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవుల మంజూరుపై ప్రభుత్వం ఉదాసీనత
- ఉక్కపోత తాళలేక ఇబ్బంది పడుతున్న చిన్నారులు


అంగన్‌వాడీ కేంద్రంలో ఉక్కపోత తాళలేక పోతున్న చిన్నారులు

తాడిపత్రి రూరల్: అధికారం చేపట్టినప్పటి నుంచి అన్ని వర్గాలను ఇబ్బంది పెడుతూ వస్తున్న కూటమి ప్రభుత్వం చివరకు చిన్నారులను సైతం ఉపేక్షించడం లేదు. కూటమి ప్రభుత్వ నిర్దయ కారణంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు విలవిల్లాడుతున్నారు. సాధారణంగా వేసవి వచ్చిందంటే అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు మంజూరు చేయడం పరిపాటి. ఈ విషయంగా తెలంగాణ ప్రభుత్వం మే 1 నుంచి జూన్ 30వ తేదీ వరకూ అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించింది. ఇందుకు భిన్నంగా ఏపీలో మాత్రం వేసవి సెలవులు ప్రకటించకుండా చిన్నారులపై నిర్దయగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే రకరకాల యాప్‌లతో అంగన్‌వాడీ టీచర్లను నానా రకాలుగా ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం తాజాగా ఉదయం 8 నుంచి 12 గంటల వరకు చిన్నారులకు ఒంటిపూట బడి పెట్టుకోవాలని, టీచర్లు, ఆయాలు తప్పనిసరిగా సాయంత్రం నాలుగు గంటల వరకూ అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఉండాలని ఉత్తర్వులు జారీ చేసింది. రెండు నెలల క్రితం జీతాల పెంపుతోపాటు పెండింగ్‌లో ఉన్న బకాయిలపై అంగన్‌వాడీలు రాష్ట్ర ప్రభుత్వంపై ఆందోళనకు దిగారు. అప్పట్లో ప్రభుత్వం మాట లెక్కచేయకుండా చలో విజయవాడ పేరుతో వేలాది మందితో భారీ ధర్నాను చేపట్టారు. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న కూటమి ప్రభుత్వం జీతాలు పెంచకపోవడమే కాకుండా వేసవి సెలవులు ఇవ్వకుండా అంగన్‌వాడీలపై కక్ష తీర్చుకుంటోందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు:	5,125
6 ఏళ్ల లోపు పిల్లల సంఖ్య:	1,63,700 మంది
గర్భిణులు:	14,900 మంది
బాలింతలు:	13,100 మంది

ఉక్కపోత తాళలేక...

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించిన ప్రభుత్వం... అంగన్‌వాడీ కేంద్రాల విషయంగా నిర్దయగా వ్యవహరించడం విడ్డురంగా ఉంది. వేసవి సెలవులు ప్రకటించకపోవడంతో లబ్ధిదారులు తప్పనిసరిగా కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. లేకపోతే వారికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రయోజనాలు అందకుండా పోతాయి. ఎండ వేడిమి, ఉక్కపోత కారణంగా గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. చిన్నారులయితే ఉక్కపోత తాళలేక ఏడుస్తుండడంతో వారిని సముదాయించలేక ఆయాలు నానా ఇబ్బంది పడుతున్నారు.

కిశోర వికాసం పేరుతో..

కిశోర వికాసం పేరుతో వారానికి రెండు రోజులు సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్‌వాడీలు కన్వీనర్లుగా వారి సెంటర్ల పరిధిలోని కిశోర బాలికలను సర్వే చేసి, వారితో సచివాలయ పరిధిల్లోని ఎఎన్‌ఎంలు, ఎంఎస్‌కేలతో కలిసి ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రాపౌట్, బాల్య వివాహాలపై నష్టాలు, వారికి పుట్టే బిడ్డల అనారోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించాలని ఆదేశించింది. ఎండలు తీవ్ర ప్రభావం చూపే మే మాసం మొత్తం సమావేశాలు నిర్వహించేలా జారీ అయిన ఉత్తర్వులపై లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమం మంచిదే అయినా.. వేసవిలో అంగన్‌వాడీలకు సెలవులు లేకుండా చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉత్తర్వులు రాలేదు

వేసవి సెలవులపై ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. మే 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ ఆయాలు, 16 నుంచి 31వ తేదీ వరకూ టీచర్లకు సెలవులు ఇచ్చాం. ఈ నెల రోజుల్లో తొలి 15 రోజులు టీచర్లు, తర్వాతి 15 రోజులు ఆయాలు అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచి కార్యకలాపాలు నిర్వహించాలి.
– సాజిదా బేగం, సీడీపీఓ, తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్ట్

లారీని ఢీ కొన్న ఆర్టీసీ బస్సు

- 11 మందికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పెద్దవడుగూరు: లారీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు మంగళవారం రాత్రి బయలుదేరిన ఆర్టీసీ బస్సు బుధవారం తెల్లవారుజామున పెద్దవడుగూరు మండలం కాశేపల్లి టోల్‌ప్లాజా సమీపంలోకి చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై ఎదురుగా వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో గుత్తి పట్టణానికి చెందిన దశకంఠేశ్వరరెడ్డి, పావని, ప్రవళిక, కర్నూలుకు చెందిన సుహేల్, నఫీస్, ఆత్మకూరుకు చెందిన శరత్, వెంకటేష్, దన్విన్‌తో పాటు మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను తొలుత గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం, కర్నూలులోని ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పెద్దవడుగూరు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రి ఏఓపై బదిలీ వేటు


ఏఓ రామ్‌ప్రసాద్

గుంతకల్లు టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి పరిపాలనా అధికారి ఆర్. రామ్‌ప్రసాద్‌పై ఎట్టకేలకు బదిలీ వేటు పడింది. ఆస్పత్రిలో అవినీతి, అక్రమాలకు పాల్పడటమే కాకుండా మహిళా సిబ్బందిని వేధించారనే ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారుల విచారణ చేపట్టి రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్‌కు నివేదిక అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా ఆయనను పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి బదిలీ చేస్తూ రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ ఎ.సిరి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్ రెడ్డి తెలిపారు.

పట్టాలపై యువకుడి మృతదేహం

రాప్తాడు: స్థానిక జేఎన్‌టీయూ మార్గంలోని పండమేరు రైల్వే బ్రిడ్జి సమీపంలో పట్టాలపై ఓ యువకుడి మృతదేహాన్ని బుధవారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ధర్మవరం జీఆర్పీ ఎస్‌ఐ దేవదాసు అక్కడకు చేరుకుని పరిశీలించారు. 20 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న యువకుడు నలుపు రంగు నైట్‌ప్యాంట్, కాఫీ రంగు టీ షర్ట్ ధరించి ఉన్నాడు. తల పూర్తిగా ఛిద్రమై మొండెం మాత్రమే మిగిలి ఉండడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని మృతదేహం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

భక్తుడిపై సెల్‌ఫోన్ కౌంటర్ నిర్వాహకుడి దురుసు ప్రవర్తన


జరిగిన అవమానాన్ని వివరిస్తున్న భక్తుడు ఆంజనేయులు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో తనపై సెల్‌ఫోన్ కౌంటర్ నిర్వాహకుడు దురుసుగా ప్రవర్తించాడంటూ తాడిపత్రికి చెందిన ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డాక్టర్‌గా పనిచేస్తున్న తన కుమారుడికి వివాహం నిశ్చయం కావడంతో తొలి ఆహ్వాన పత్రికను స్వామి వారి సన్నిధిలో ఉంచేందుకు భార్యతో కలసి కసాపురం వచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో టెంకాయలు కొనుగోలు చేసిన చోటనే చెప్పులు, సెల్‌ఫోన్లు పెట్టి ఆలయంలోకి ప్రవేశిస్తుండగా సెల్‌ఫోన్ కౌంటర్ నిర్వాహకుడు మొబైల్ పెట్టి వెళ్లాలంటూ దబాయించాడన్నారు. తన వద్ద సెల్‌ఫోన్ లేదని చెప్పినా వినకుండా దౌర్జన్యానికి దిగాడన్నారు. దీంతో తాను అసహనం వ్యక్తం చేయడంతో నేరుగా వచ్చి చొక్కా పట్టుకుని చెప్పుతో కొడతానంటూ దాడికి యత్నించాడన్నారు. ఆ సమయంలో పక్కన ఉన్న భక్తులు జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగిందన్నారు. ఘటనపై ఆలయ ఈఓకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నిస్తే అందుబాటులో లేరని, ఆలయం బయటకు వచ్చిన తర్వాత ఈఓ సెల్‌ఫోన్ నంబర్‌కు కాల్ చేసినా అందుబాటులోకి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఈఓకు ఫోన్ చేస్తే ఆయన హైదరాబాద్‌లో ఉన్నట్లుగా తెలిపారన్నారు. స్వామి దర్శనార్థం వచ్చే భక్తులపై ఆలయ సిబ్బంది దురుసుగా వ్యవహరించడం, ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇలాంటి దుర్ఘటనలు చోటు చేసుకోకుండా ఇప్పటికైనా ఆలయ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఐకమత్యంగా జీవించండి

- నిట్టూరు వాసులతో కలెక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టరు వినోద్‌కుమార్

యల్లనూరు: ఐకమత్యంతో స్వేచ్ఛగా, శాంతియుతంగా జీవించాలని యల్లనూరు మండలం నిట్టూరు వాసులకు కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. 85–నిట్టూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అసిస్టెంట్ కలెక్టరు సచిన్ రహర్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టరు కొంకిరి కమలమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ.. ప్రతి నెల ఓ గ్రామాన్ని ఎంపిక చేసి పౌరహక్కుల దినోత్సవాన్ని జరుపుతామన్నారు.అన్ని శాఖల అధికారులు, పోలీసులు తప్పక పాల్గొని, గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. ఆర్డీఓ కేశవనాయుడు మాట్లాడుతూ.. గ్రామంలో కొన్ని భూ సమస్యలు ఉన్నాయని వాటిని చట్ట ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామంలోని దళిత వాడలో పర్యటించారు. పుష్పలత, బాలరాజు ఇంటికి వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. మురుగు నీరు రోడ్లపై ప్రవహించకుండా సీసీ డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ వాసుదేవరెడ్డిని ఆదేశించారు. కాలనీకి వాటర్ ట్యాంకు ఏర్పాటు చేయాలని, శ్మశాన వాటికకు దారి చూపాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశులు, తహసీల్దారు శేషారెడ్డి, ఎంపీపీ గంగాదేవి, ఎంపీటీసీ శ్రీదేవి, సర్పంచ్ శారద, సోషల్ వెల్ఫేర్ జేడీ రాధిక, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియాలో వైఎస్సార్‌సీపీకి తరగని ఆదరణ



ఆస్ట్రేలియాలో ఆలూరు సాంబశివారెడ్డికి స్వాగతం పలుకుతున్న ప్రవాసాంధ్రులు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీపై ఆస్ట్రేలియాలో ప్రవాసాంధ్రులు విశేష ఆదరణ కనబరిచారు. ఆ పార్టీ ఎన్‌ఆర్‌ఐ విభాగ కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి ఆస్ట్రేలియా పర్యటనలో ఈ విషయం బహిర్గతమైంది. ఈ నెల 10వ తేదీ వరకు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సింగపూర్ దేశాల్లో ఆలూరు సాంబశివారెడ్డి పర్యటించి అక్కడి ప్రవాసాంధ్రులతో సమావేశం కానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం సిడ్నీకి చేరుకున్న ఆయనకు ఎయిర్‌పోర్టులో ఆస్ట్రేలియా వైఎస్సార్ సీపీ కన్వీనర్ చింతలచేరు సూర్యనారాయణరెడ్డి నేతృత్వంలో లంకెల రాజశేఖర రెడ్డి, యేళ్ల అమర్‌నాథ్, గొల్లపల్లి చంద్రమౌళిరెడ్డి, కేఎల్ ఉమేష్, మురారి చింతల పెద్దిరెడ్డి, ఉమ్మడి మనోహర్, గాయం శ్రీనివాసరెడ్డి, హనుమంత రెడ్డి, రాజేందర్, విజయ్, దేవశేఖర్, బొమ్మక శివా రెడ్డి ఘనస్వాగతం పలికారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పాలనపై ప్రవాసాంధ్రులందరూ సంతృప్తితో ఉన్నారని, రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేందుకు తమవంతు పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా ప్రవాసాంధ్రులు భరోసానిచ్చారు.



- మీ సేవలు అమూల్యం

ఉద్యోగ విరమణ చేసిన డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, కలెక్టరేట్ భూ సంస్కరణల విభాగం తహసీల్దారు నారాయణస్వామితో పాటు తొమ్మిది మంది అధికారులు, ఉద్యోగులకు బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్ ఆత్మీయ అభినందన సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రావర్, డీఆర్‌ఓ ఎ.మలోల, తదితరులు పాల్గొన్నారు.
– అనంతపురం అర్బన్:

నీటి తొట్టెల నిర్మాణాలు వేగవంతం చేయండి


నీటి తొట్టె నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డ్వామా పీడీ సలీంబాషా

కూడేరు: మండలానికి మంజూరైన పశువుల నీటి తొట్టెల నిర్మాణాలను నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని ఉపాధి సిబ్బందిని డ్వామా పీడీ సలీంబాషా ఆదేశించారు. కూడేరులో బుధవారం ఆయన భూమిపూజ చేసి నీటి తొట్టె నిర్మాణ పనులు ప్రారంభించి, మాట్లాడారు. మండలానికి 39 తొట్టెలు మంజూరు కాగా, ఒక్కో తొట్టె నిర్మాణానికి రూ.40 వేలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత లోపించకుండా జూన్ నెలాఖరుకు ఈ నిర్మాణాలు పూర్తి కావాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మహిళా రైతు వెంకటలక్ష్మి పొలంలో చేపట్టిన ఫారంపాండ్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, ఏపీడీ విజయ కుమార్, ఇంజనీర్ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చీనీ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

గార్లదిన్నె: మండలంలోని కనుంపల్లి, జంబులదిన్నె కొట్టాలలో చీనీ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన స్థలం కోసం బుధవారం ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ అధికారులు పరిశీలన చేపట్టారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ అధికారి అజయ్ కుమార్, జిల్లా ఉద్యాన అధికారి ఫిరోజ్‌ఖాన్ తదితరులు రెవెన్యూ అధికారులు గుర్తించిన ప్రభుత్వ భూమిని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ... రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందిన వెంటనే అనువైన స్థలంలో దాదాపు రూ.3.5 కోట్లతో చీనీ ఆధారిత పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మైక్రోఇరిగేషన్ అధికారి రఘునాథ్‌రెడ్డి, ఉద్యాన అధికారి రత్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు ఎంపిక



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ అనుబంధ విభాగాల కమిటీల్లో పలువురికి చోటు కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చేనేత విభాగం ఉపాధ్యక్షుడిగా నిమ్మల వెంకటరమణ (ఉరవకొండ), కార్యదర్శులుగా కురుబ లోకేష్ (కళ్యాణదుర్గం), ఎం చౌడయ్య, బి.ప్రకాష్ (తాడిపత్రి), కొత్తోళ్ల పార్వతి (అనంతపురం), కాసుల ఆంజనేయ ప్రసాద్ (ఉరవకొండ)కు చోటు కల్పించారు.

- **ట్రేడ్ యూనియన్:** ఉపాధ్యక్షులుగా రానకాల రాజారత్నం (అనంతపురం), సి.భీమలింగప్ప (గుంతకల్లు), ప్రధాన కార్యదర్శులుగా బి.రాజశేఖరరెడ్డి, సంపంగి రామాంజినేయులు (అనంతపురం), ఎం.నరేష్ (ఉరవకొండ), కరూరు కోటేశ్వరరెడ్డి (రాయదుర్గం), దూదేకుల వన్నూరువలి (గుంతకల్లు), బి.వెంకటనారపరెడ్డి (అనంతపురం), కార్యదర్శులుగా హరిజన ప్రకాష్, బెరిల తిమ్మరాజు (కళ్యాణదుర్గం), బొనాసి అనిల్‌కుమార్‌గౌడ్ (అనంతపురం), పి.బాలరాజు (తాడిపత్రి)కు అవకాశం కల్పించారు.
- **వలంటీర్ విభాగం:** ఉపాధ్యక్షుడిగా బాల మారుతీప్రసాద్ (అనంతపురం), ప్రధాన కార్యదర్శులుగా యరబాప హరినాథ్ రెడ్డి (కళ్యాణదుర్గం), బొమ్మల హనుమంతు, పి.హిదయాతుల్లా (అనంతపురం), పి.రాజు (తాడిపత్రి), పి.తేజేశ్వరరెడ్డి(ఉరవకొండ), కార్యదర్శులుగా బొజ్జె మోహన్‌రెడ్డి, బోయ నరసింహులు (కళ్యాణదుర్గం), అశ్వ సురేష్ (గుంతకల్లు), టి.కొండారెడ్డి (తాడిపత్రి), జొలకుంట్ల నరేంద్రరెడ్డి (ఉరవకొండ)ను ఎంపిక చేశారు.
- **విద్యార్థి విభాగం:** ఉపాధ్యక్షులుగా కొత్తకాపు మంజునాథరెడ్డి (ఉరవకొండ), పి.వెంకటేష్ (అనంతపురం), ప్రధాన కార్యదర్శులుగా కురుబ వసికేరి (ఉరవకొండ), జి.మహేష్ (రాయదుర్గం), బి.విజయవర్ధన్‌రెడ్డి (తాడిపత్రి), వి.సాయి నితిన్ (అనంతపురం), కంబదూరు అశోక్ (కళ్యాణదుర్గం), కాపు నిషాంత్ రెడ్డి (అనంతపురం), కార్యదర్శులుగా కైరేవు మహాలింగ (కళ్యాణదుర్గం), మెట్టి నాగరాజు (ఉరవకొండ), ఎం.మహేష్‌నాయక్, గోగుల హరినాథరెడ్డి (శింగనమల), ఎం.గంగ శివుడు యాదవ్ (అనంతపురం)కు చోటు కల్పించారు.
- **ఎస్టీ సెల్:** ఉపాధ్యక్షులుగా సాకే శ్రీనివాసులు (అనంతపురం), గోవిందనాయక్ సుగాలీ (ఉరవకొండ), ప్రధాన కార్యదర్శులుగా ఎస్.వెంకటసాయికుమార్ నాయక్ (తాడిపత్రి), ఆర్.నాగరాజు నాయక్ (అనంతపురం), రాచేరి హనుమంతు (గుంతకల్లు), జి.శివయ్య (శింగనమల), సాకే రాజశేఖర్ (అనంతపురం), ఆర్.ఆదెప్ప (కళ్యాణదుర్గం), గుజ్జల శివకుమార్ (అనంతపురం), కార్యదర్శులుగా సుగాలి శోభా బాయి, సాకే ఆనంద్, సాకే మురళి (అనంతపురం), కాశీరాం నాయక్, ఎరికల రమేష్ (కళ్యాణదుర్గం), జి.అంజన్ మూర్తి (శింగనమల), ముంగ ప్రదీప్ (ఉరవకొండ), ఇస్లావంత్ రామాంజినేయులు (తాడిపత్రి), ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సుంకే నాయక్ సుగాలీ (ఉరవకొండ), కె.మోహన్ నాయక్ (అనంతపురం), ఎస్.పురుషోత్తం (ఉరవకొండ), వడిత్యా బాబూనాయక్, కె.శ్రీనివాసనాయక్ (కళ్యాణదుర్గం), జి. శివ, డి.శ్రీకాంత్, డి.నరసింహ (శింగనమల), జి.రామాంజనేయులు (ఉరవకొండ), డి.తిక్కయ్య, ఎస్.ఈశ్వరయ్య(అనంతపురం), ఈ.రామాంజనేయులు నాయక్, ఈ.మహేష్‌కుమార్ (తాడిపత్రి), ఎస్.లోకనాథ్‌నాయక్, ఎ.మగ్గేనాయక్, ఎం.హరినాయక్ (రాయదుర్గం)కు అవకాశం కల్పించారు.
- **ఎస్సీ విభాగం:** ఉపాధ్యక్షులుగా నీలం భాస్కర్ (శింగనమల), కరప్పగారి రఘురామయ్య (ఉరవకొండ), ప్రధాన కార్యదర్శులుగా ఓబులేసు (గోవిందరెడ్డి, కళ్యాణదుర్గం), కేఎం రాజన్న (రాయదుర్గం), లబ్బే రాఘవ రమేష్, బండారు శోభారాణి, మిద్దె నగేష్ (అనంతపురం), సాకే ఓబులేసు (గుంతకల్లు), కార్యదర్శులుగా బెరిళ పాండురంగ (కళ్యాణదుర్గం), గద్దల భావన (గుంతకల్లు), బి.రమేష్ (తాడిపత్రి), దొడ్డికల్లు రమేష్ (ఉరవకొండ), వగ్గేయగారి మల్లికార్జున, హరిజన వెంకటేశులు (రాయదుర్గం), తాడిమర్రి నరేంద్ర (అనంతపురం), సాకే రామాంజనేయులు (శింగనమల)ను ఎంపిక చేశారు.
- **వాణిజ్య విభాగం:** ఉపాధ్యక్షులుగా చెకూరు నాగరాజు (ఉరవకొండ), గోప మధుసూదన్ (అనంతపురం), ప్రధాన కార్యదర్శులుగా కె.పెద్దిరెడ్డి (రాయదుర్గం), ఆర్.మోహన్‌రెడ్డి (తాడిపత్రి), రమణారెడ్డి (గుంతకల్లు), సుంకు నాగేంద్రరెడ్డి(అనంతపురం), కార్యదర్శులుగా బండి రామిరెడ్డి, మఠం మహాబలి (కళ్యాణదుర్గం)ను ఎంపిక చేశారు.
- **సోషల్ మీడియా విభాగం:** ఉపాధ్యక్షుడిగా వన్నూరుస్వామి (ఉరవకొండ), ప్రధాన కార్యదర్శులుగా బైరగొండ్ల నుంకేష్(రాయదుర్గం), ఎం.అమరేశ్వరరెడ్డి (తాడిపత్రి), ఎలనవట్టి శ్రీనివాసరెడ్డి, వై రవీంద్ర (అనంతపురం), కార్యదర్శులుగా జి.శ్రీనివాసులు, హెచ్.బాబు (కళ్యాణదుర్గం), ఓం ప్రకాష్ బోయ (ఉరవకొండ), పి.సాయిప్రసాద్ (అనంతపురం)కు అవకాశం కల్పించారు.
- **ప్రచార విభాగం:** ఉపాధ్యక్షులుగా బి.హుస్సేన్‌పీరా (గుంతకల్లు), చవ్వా హనుమంతరెడ్డి (అనంతపురం), ప్రధాన కార్యదర్శులుగా సి.హేమకిరణ్ (అనంతపురం), చిన్న వెంకటేశులు (ఉరవకొండ), దేశాయ్ చంద్రశేఖర్‌రెడ్డి (రాయదుర్గం), అమ్మిశెట్టి విక్రమ్ (అనంతపురం), బి.నారాయణస్వామి (కళ్యాణదుర్గం), మన్నల రామమూర్తి (అనంతపురం), కార్యదర్శులుగా పి.వెంకటరామిరెడ్డి (తాడిపత్రి), గడిపాటి గోవర్ధనరెడ్డి (గుంతకల్లు), పాలకాశి (కళ్యాణదుర్గం), ఎల్.శంకరరెడ్డి (తాడిపత్రి), రామచంద్ర (ఉరవకొండ), వి.రామిరెడ్డి (గుంతకల్లు), నిమ్మల నాగరాజు (అనంతపురం అర్బన్)కు చోటు కల్పించారు.

క్లుప్తంగా

సమాజాన్ని మార్చిన శ్రీశ్రీ రచనలు



మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

అనంతపురం కల్చరల్: శ్రమజీవుల జీవితాలకు అర్థం పరమార్థం కల్పించి సమాజ దృక్పథాన్ని మార్చిన మహాకవి శ్రీశ్రీ ఆదర్శప్రాయుడని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ అన్నారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద జేవీవీ పుస్తక వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాహిత్య ముద్రతో సమాజాన్ని మేల్కొలిపిన మహానుభావుడు శ్రీరంగం శ్రీనివాసరావు అని, ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంట్లో మంచి పుస్తకాలకు చోటివ్వాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నానీల నాగేంద్ర, జేవీవీ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, మహమ్మద్ జిలాన్, గాంగేనాయక్, విరుపాక్షి, తిరుపాలు, ముత్యాలు, రామిరెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవలు చిరస్మరణీయం



ఎస్బీ ఎస్ఐ గురుమూర్తి దంపతులను సన్మానిస్తున్న అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి

అనంతపురం: ఆరోగ్య సమస్యలు లేకుండా ఉద్యోగ విరమణ పొందడం అదృష్టమని అడిషనల్ ఎస్పీ డీవీ రమణ మూర్తి అన్నారు. బుధవారం ఎస్బీ ఎస్ఐ గురుమూర్తి ఉద్యోగ విరమణ చేశారు. పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్బీ ఎస్ఐ గురుమూర్తి దంపతులను అడిషనల్ ఎస్పీ ఘనంగా సన్మానించారు. ఎస్ఐ గురుమూర్తి పోలీసు శాఖలో అంకితభావంతో విశేష సేవలు అందించారన్నారు. 35 సంవత్సరాల పాటు పోలీసుల శాఖలో నిబద్ధతతో పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ ధరణికిశోర్, క్రాంతికుమార్, ఎస్బీ ఎస్ఐలు చౌదరి, వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సమ్మర్ క్యాంపులు



పోస్టర్లను విడుదల చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న

రాప్తాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో మే 2 నుంచి జూన్ 10 వరకూ సమ్మర్ స్పెషల్ కాంపులు పకడ్బందీగా నిర్వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత తెలిపారు. బుధవారం రాప్తాడులో సెక్టార్ సమావేశం నిర్వహించి, కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కిశోర బాలికలను మానసికంగా తీర్చిదిద్దేందుకు సమ్మర్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ క్యాంపు ముగిసేలోపు 12 సెషన్స్ జరపాలని ఆదేశించారు. మే 2న బాలికల పరస్పర పరిచయం, వారి లక్ష్యాలు అడగటం, 6న రుతుక్రమ పరిశుభ్రత నిర్వహణ, ఆరోగ్య పరిరక్షణ, మే 9న బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించాలన్నారు. గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శితో పాటు ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లు, గ్రామైక్య సంఘాల లీడర్లు, ఆశావర్కర్లను సమన్వయం చేసుకుంటూ సెషన్స్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: బాల్యంలో నేర్చుకున్న నైతిక విలువలతోనే ఉన్నత స్థితికి చేరుకోగలమని ఈశ్వరీయ ప్రజాపిత బ్రహ్మకుమారీ జిల్లా ఇన్‌చార్జి సిస్టర్ శారద అన్నారు. గత ఐదురోజులుగా బ్రహ్మకుమారీల ఆశ్రమంలో సాగిన వేసవి శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా సిస్టర్ శారదా మాట్లాడుతూ.. చదువు అంటే ర్యాంకులు, మార్కులు కావని నైతిక విలువలు నేర్చుకోవాలన్నారు. సమ్మర్ క్యాంపులో మెడిటేషన్, యోగా, స్టోరీ టెల్లింగ్, గేమ్స్ అన్ని భారతీయత ఉట్టిపడేలా నేర్పించామన్నారు. సమ్మర్ క్యాంపులో పాల్గొన్న వందమంది చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం డీడీఓ శ్రీనివాస్, రాష్ట్రపతి అవార్డుగ్రహీత బిసాటి భరత్, డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, యోగా మాస్టర్ ఎంటీ మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అక్షయ తృతీయ సందడి

అనంతపురం కల్చరల్: అక్షయ తృతీయ వేడుకలు బుధవారం పలు చోట్ల నేత్రపర్వంగా జరిగాయి. సోమనాథ నగర్‌లోని కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం వేడుకగా సాగింది. వేదపండితులు వేణుగోపాల కృష్ణమూర్తి, మణూరు నాగరాజు, ఉమారాణి తదితరులు మంత్రోచ్చాటనలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. మొదటి రోడ్డు మంత్రాలయ రాఘవేంద్ర స్వామి, పాతూరులోని వ్యాసరాజ మఠంలో కొలువైన బృందావనాలకు, లక్ష్మీనరసింహ స్వామి మూలవిరాట్టుకు చందన అలంకారాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు బారులుతీరి స్వామివార్లను దర్శించుకున్నారు. శివబాలయోగి ఆశ్రమంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. అక్షయ తృతీయ రోజున బంగారం కొని దాచుకుంటే శుభం కలుగుతుందన్న సెంటిమెంట్‌తో బంగారం కొనుగోలుకు ఆసక్తి చూపారు. పలు వీధుల్లోని బంగారు దుకాణాలు నగదగలతో కిటకిటలాడాయి.

బొమ్మేపర్తిలో..

రాప్తాడు: బొమ్మేపర్తి గ్రామంలో గణపతి సచ్చిదానంద స్వామి మాతృమూర్తి జయలక్ష్మీ మాత జయంత్యుత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు వేడుకలు జరగనుండటంతో బొమ్మేపర్తిలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మొదటి రోజు బుధవారం బొమ్మేపర్తిలో గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో గణపతి సచ్చిదానంద స్వామిజీ, ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థస్వామి చేతుల మీదుగా అక్షయ తృతీయ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం



ఓ దుకాణంలో నగలు కొనుగోలు చేస్తున్న మహిళలు



చందనోత్సవంలో రాఘవేంద్ర స్వామి, నరసింహ స్వామి



హెచ్చెల్సీ కాలనీలో ఐశ్వేర్యేశ్వర వ్రతం

ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ)పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన బీటెక్ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–20) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంసీఏ నాలుగో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంబీఏ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎమ్మెస్సీ ఒకటో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలను ఆ వర్సిటీ వీసీ హెచ్.సుదర్శనరావు బుధవారం విడుదల చేశారు. బీటెక్ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్‌లో 98.62 శాతం, ఎంసీఏ నాలుగో సెమిస్టర్‌లో 92.15 శాతం, ఎంబీఏ నాలుగో సెమిస్టర్‌లో 88.47శాతం, ఎమ్మెస్సీ ఒకటో సెమిస్టర్‌లో 85శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వీసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణయ్య, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ వి.నాగప్రసాదనాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఏపీ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్స్ జి.శంకర్ శేఖర్‌రాజు, డాక్టర్ ఎం.అంకారావు, డాక్టర్ ఎస్.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కొడిమిలో గొర్రెల అపహరణ

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కొడిమి గ్రామంలో రెండు రోజుల క్రితం గొర్రెలను అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొడిమి గ్రామానికి చెందిన బండి ముసలన్నకు 500 గొర్రెలు ఉన్నాయి. గ్రామ శివారులోని జగనన్న కాలనీ పక్కన ఫకృద్దీన్‌కు చెందిన తోటలో వాటిని వదిలాడు. రాత్రి సమయంలో 49 గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఆర్డీటీ సెట్ కొనసాగించాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో ప్రతిభ ఉండి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద విద్యార్థులకు వరంలా ఉన్న ఆర్డీటీ సెట్‌ను కొనసాగించాలి. ఇందుకు ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్డీటీ సంస్థకు సంబంధించిన ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం విద్యార్థులతో కలిసి టవర్ క్లాక్ వద్ద నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు తరిమెల గిరి మాట్లాడుతూ.. విద్య, వైద్యం, వ్యవసాయం రంగాల్లో వెనుకబడిన జిల్లాకు ఆర్డీటీ వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయకుండా కరువు జిల్లాను మరింత కరువు కాటకాల్లోకి నెట్టే విధంగా వ్యవహరిస్తోందన్నారు. వేరే దేశం నుంచి వచ్చి ఈ దేశంలో సేవ చేస్తున్న ఇలాంటి సంస్థలను ప్రోత్సహించాల్సింది పోయి అడ్డుకోవడం దుర్మార్గం అన్నారు. వెంటనే ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి భీమేష్, నగర నాయకులు నాగభూషణ, సోము, విజయ్, సాయి, అజయ్ పాల్గొన్నారు.

టూ టౌన్ సీఐనే డబ్బులు అడుగుతారా?

అనంతపురం: టూ టౌన్ సీఐ పేరు చెప్పి ముగ్గురు ఆకతాయిలు నిత్యావసర సరుకులు తీసుకుని బిల్లు ఎగురగొట్టిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు.. అనంతపురంలోని పాతూరు పోస్టాఫీసు సమీపంలో కళ్యాణ్ అనే వ్యక్తికి చెందిన జనరల్ స్టోర్‌కు లక్ష్మీనారాయణ, జశ్వంత్, రవి ముగ్గురు యువకులు కారులో వచ్చారు. జశ్వంత్ అనే యువకుడు జనరల్ స్టోర్‌లోకి వెళ్లి నిత్యావసర సరుకులు తీసుకున్నాడు. మొత్తం బిల్లు రూ.3 వేలు కావడంతో డబ్బు కట్టాలని షాపు యజమాని కోరాడు. కారులో టూ టౌన్ సీఐ ఉన్నారు. ఆయన్నే డబ్బులు అడుగుతారా? అంటూ నిలదీశాడు. సరుకులు కారులో పెట్టుకుని వెళ్లిపోయారు. అప్రమత్తమైన షాపు యజమాని కారు నంబర్ రాసుకుని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కారు నంబర్ ఆధారంగా పోలీసులు వివరాలు సేకరించారు. అనంతపురానికి చెందిన లక్ష్మీనారాయణ, జశ్వంత్, రవి అనే ముగ్గురు యువకులను అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపారు.

ఆర్డీటీని కాపాడుకుందాం

అనంతపురం అర్బన్: బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్న ఆర్డీటీ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని దండోరా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధికార ప్రతినిధి అక్కులప్ప అన్నారు. ఆర్డీటీని కాపాడుకోవాలంటూ బుధవారం కలెక్టరేట్ సమీపంలోని ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి ఎస్సీ సంఘాల నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ వినోద్ కుమార్‌ను ఆయన చాంబర్ వద్ద నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. లక్ష్మన్న, ధనుంజయ, శ్రీనివాసులు, రవి, యల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

సేవ్ ఆర్డీటీ..

అనంతపురం అర్బన్: పేదల అభ్యున్నతే లక్ష్యంగా జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ సేవలందిస్తున్న ఆర్డీటీ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏపీయూడబ్ల్యూజే నాయకులు అన్నారు. ఆర్డీటీకి విదేశీ నిధులు అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. సేవ్ ఆర్డీటీ నినాదంతో బుధవారం కలెక్టరేట్ సమీపంలోని ఫాదర్ ఫెర్రర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, గౌరవాధ్యక్షుడు భోగేశ్వరరెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు జగదీష్, ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డానియల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేపీ కుమార్, నాయకులు, జర్నలిస్టులు రామచంద్ర, చౌడప్ప, అక్కులప్ప, భూమిరెడ్డి, ప్రసాద్, ఆనందవర్ధన్, శేషాద్రి, శేఖర్, బన్సీలాల్, రాజశేఖర్, వెంకటరెడ్డి, సాయి పాల్గొన్నారు.



ఫాదర్ ఫెర్రర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా కల్పతరువు అయిన ఆర్డీటీ సంస్థను రక్షించుకుందామని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆర్డీటీ ప్రధాన కార్యాలయం వద్ద ఆర్డీటీ సేవలను కొనసాగించాలని ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో ఐఎంఎం మహబూబ్ బాషా, జాకీర్ హుస్సేన్, టిప్పుసుల్తాన్, నజీర్, ప్రజాబలం గోగుల మూర్తి, ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ, జేఏసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వాల్మీకి సంఘం రాయలసీమ ఇంచార్జి సాంబ, మసూద్, సమీ ముల్లా, నజీర్, వన్నూరు, బాష, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

4న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఈ నెల 4న ఉదయం 10 గంటలకు ఆ సంఘం నగరశాఖ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల అధికారులుగా సంఘం ప్రధాన కార్యదర్శి రాము నాయక్, సహాధ్యక్షుడు వేణుగోపాల్‌ను నియమించినట్లు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా 'సివిల్ రైట్స్ డే'

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా సివిల్ రైట్స్‌డే (పౌరహక్కుల దినోత్సవం) సందర్భంగా బుధవారం పౌరహక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సంబధిత సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో పోలీసులతో పాటు రెవెన్యూ, తదితర ప్రభుత్వ విభాగాలు సంయుక్తంగా వెళ్లి రాజ్యాంగంలోని చట్టాలు, పౌరహక్కుల గురించి ప్రజలకు వివరించారు.

3న ద్విచక్ర వాహనాల వేలం

అనంతపురం: అనంతపురం త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 3వ తేదీన 23 ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్లు త్రీ టౌన్ సీఐ కే.శాంతిలాల్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.3 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. వేలం ముగిసిన అనంతరం వాహనాలు దక్కని వారికి రూ.3 వేలు డిపాజిట్ డబ్బు వెనక్కి చెల్లిస్తామన్నారు.

బంగారు కంఠాభరణం వితరణ

గార్లదిన్నె: మండలంలోని కోటంకలో వెలసిన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి బుధవారం బంగారు నెమలి కంఠాభరణాన్ని అనంతపురానికి చెందిన భక్తులు వితరణ చేశారు. ఈ సందర్భంగా దాతల పేరున అర్చకులు విశేష పూజలు జరిపి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ప్రధాన అర్చకుడు రామాచార్యులు మాట్లాడుతూ.. అనంతపురానికి చెందిన చలమారెడ్డి జ్ఞాపకార్థం రూ.4.40 లక్షల విలువైన బంగారు నెమలి కంఠాభరణాన్ని ఆయన భార్య ఈశ్వరమ్మ, కుమారులు చంద్రమోహన్‌రెడ్డి, హరినాథరెడ్డి, కుటుంబసభ్యులు అందజేశారని వివరించారు.

గ్రూప్–1 మెయిన్స్ తేదీలు మార్చాలి

అనంతపురం అర్బన్: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈనెల మొదటి వారంలో నిర్వహించనున్న గ్రూప్–1 మెయిన్స్ తేదీలను మార్పు చేయాలని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సివిల్ సర్వీసెస్ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులపై విద్యాపరమైన, భావోద్వేగ ఒత్తిడిని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాలన్నారు. బుధవారం కలెక్టర్ వినోద్ కుమార్‌ను ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సంతోష్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుళ్లాయిస్వామి, తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. అభ్యర్థుల భవిష్యత్తు దృష్ట్యా ఏపీపీఎస్సీ గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష తేదీ మార్పు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. మంజునాథ్, ఆనంద్‌కుమార్, పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాబోవు రోజుల్లో పోరాటాలకు సిద్ధం కావాలని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీ సుందర్ రామరాజు, విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ పిలుపునిచ్చారు. బుధవారం అనంతపురంలో ఏఐఎస్‌బీ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగ సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. ఫీజురీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు.

ఐకమత్యంతోనే దేశాన్ని కాపాడుకోగలం

అనంతపురం కల్చరల్: కులమతాలకతీతంగా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని, ఐకమత్యంతోనే దేశాన్ని కాపాడుకోగలమని మైసూరు దత్తపీఠాధిపతులు గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. మూడు రోజులుగా అనంతపురంలోని జెడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న జ్ఞానసాగర దత్తాంజనేయ క్షేత్రంలో సాగుతున్న విగ్రహ పునఃప్రతిష్టా మహోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా సాగిన మహాకుంభాభిషేక వేడుకలకు గణపతి సచ్చిదానంద స్వామీజీ విశిష్ట అతిథిగా విచ్చేసి అనుగ్రహ భాషణం చేశారు. పెహల్గాం ఉగ్రదాడిలో అశువులు బాసిన వారికి నివాళులర్పించి, వారి కుటుంబాలకు మనమందరం మద్దతుగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ముష్కరులకు కఠిన శిక్ష పడేలా చేసేందుకు వివక్ష, వైషమ్యాలు మరిచి అందరూ ఏకం కావాలన్నారు. అక్షయ తృతీయ పర్వదిన విశిష్టతను తెలియజేస్తూ దాచుకోవడం అంటే బంగారమో, మరో లోహమో కాకుండా పుణ్యాన్ని సంపాదించుకోవాలని ప్రబోధించారు.అంతకు ముందు స్వామీజీ దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానందతీర్థులతో కలిసి ఆలయంలో జ్ఞానమూర్తి దత్తాత్రేయుడితో పాటూ వివిధ దేవతామూర్తులను పునఃప్రతిష్ఠించారు.



మహాకుంభాభిషేకంలో పాల్గొన్న గణపతి సచ్చిదానంద స్వామీజీ

స్పందించే వరకూ సమ్మె చేస్తాం

అనంతపురం మెడికల్: తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మె ఆపేది లేదని ఏపీ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్/సీహెచ్ఓ అసోసియేషన్ నాయకులు తేల్చి చెప్పారు. సమ్మెలో భాగంగా బుధవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఎదుట రిలే దీక్షలను కొనసాగించారు. అంతకు ముందు ఎంఎల్‌హెచ్‌పీలు ప్రభుత్వ సర్వజనాస్పత్రి నుంచి అంబేడ్కర్ విగ్రహ వరకూ ర్యాలీ నిర్వహించారు. ధర్నాకు ఏపీ ఎన్‌జీఓ సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. ఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ.. సీహెచ్ఓల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆరేళ్లు పూర్తి చేసుకున్న వారికి రెగ్యులరైజేషన్ చేయాలన్నారు. సీహెచ్ఓల సర్టిఫికెట్లు ఆర్‌డీ కార్యాలయంలో ఉండడంతో, వీరు ఇతర పరీక్షలు రాసేందుకు వీలులేకుండా పోయిందన్నారు. మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్ల అసోసియేషన్ నాయకులు గౌరి, దివ్య మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన సేవలందించడంలో ఎంఎల్‌హెచ్‌పీలే కీలకమయ్యారన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్యం గురించి ఆరా తీస్తూ సరైన సమయంలో అవసరమైన చికిత్సలు అందజేస్తున్నామన్నారు. ఇలాంటి తరుణంలో తమ ఉద్యోగానికి భద్రత కల్పించడం ప్రభుత్వ నైతిక బాధ్యత అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్వేత, రాజేశ్వరి, అనూష, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్ఓలు

సింహాచలం ఘటన దురదృష్టకరం

• మేయర్ వసీం



అనంతపురం కార్పొరేషన్: రాష్ట్రంలో సింహాచలం ఘటన చాలా దురదృష్టకరమని మేయర్ వసీం పేర్కొన్నారు. సింహాచలంలో మృతి చెందిన ఘటనపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తిరుపతి తర్వాత అత్యంత ప్రసిద్ధ, ప్రాముఖ్యత కల్గిన ఆలయం సింహాచలం అప్పన్నదని పేర్కొన్నారు. ఒరిస్సా నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు ఇక్కడికి ఆనవాయితీగా వస్తుంటారన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గతంలో గోదావరి పుష్కరాలు, తిరుపతిలో వైకుంఠ ఏకాదశి నాడు భక్తులు మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకుని భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేంద్రానికి బుద్ధి చెబుతాం



నిరసన తెలుపుతున్న మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్

అనంతపురం కార్పొరేషన్: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు ముస్లిం మైనార్టీలు తమ ఇళ్లు, షాపుల్లో బుధవారం విద్యుత్ దీపాలను ఆర్పి నిరసన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వక్ఫ్‌బోర్డు మాజీ జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ మాట్లాడుతూ.. కేంద్రం ముస్లిం మైనార్టీల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిందని ధ్వజమెత్తారు. రానున్న రోజుల్లో కేంద్రానికి తప్పక బుద్ధి చెబుతామన్నారు.

భక్తిశ్రద్ధలతో బసవ జయంతి



బసవేశ్వరుడి విగ్రహానికి నివాళులర్పించిన నాయకులు



ఆకట్టుకున్న కళాకారుడి విన్యాసం

అనంతపురం కల్చరల్: వీరశైవుల ఆరాధ్యదైవం బసవేశ్వరుడి జయంతి వేడుకలు బుధవారం కనుల పండువగా జరిగాయి. వందల సంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో శోభాయాత్ర ఘనంగా సాగింది. ఉదయం స్థానిక కృష్ణకళామందిరం సమీపంలోని బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేసి నీరాజనాలర్పించారు. అనంతరం ప్రియదర్శిని హోటల్ వద్ద నుంచి టవర్‌క్లాక్, సుభాష్‌రోడ్డు, సప్తగిరి సర్కిల్ మీదుగా పాతూరు బసవన్న కట్ట వరకూ ర్యాలీ సాగింది. కర్ణాటక నుంచి విచ్చేసిన కళాకారుల వీరభద్ర విన్యాసాలు, నందికోళ్ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వీరశైవ సమాజం అధ్యక్షులు ఎంజీ రాజు, వీరశైవ మహాసభ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి, జిల్లా వీరశైవ సమాజ గౌరవాధ్యక్షుడు నాగన్న, ప్రధాన కార్యదర్శి గౌళి సతీష్‌కుమార్, కోశాధికారి మల్లికార్జున, మఠం తిప్పేస్వామి, ధనుంజయ బాబు, సుశీల, ఇందిరా, లింగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రోగుల వద్దకే సేవలు..!

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో సర్వజనాస్పత్రికి రూ.లక్షలు విలువ చేసే అధునాతన పరికరాలు వచ్చాయి. ఆ పరికరాల ద్వారానే ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ఉత్తమ సేవలందుతున్నాయి. మాజీ సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయాలతో ప్రస్తుతం రోగుల వద్దకే వైద్య సేవలు అందుతున్నాయి. అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్ (ఏఎంసీ)లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులు కదలలేని పరిస్థితి. అటువంటి వారికి రౌండ్ ద క్లాక్ సేవలు అందుతున్నాయి అంటే అది జగన్ చలువే అని చెప్పుకోవచ్చు. మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ బీమసేనాచార్ ఆదేశాలతో క్రిటికల్ కేర్‌లో ఉన్న రోగుల సౌకర్యార్థం టూడీ ఎకో (గుండె పరీక్ష) చేస్తున్నారు. రోగి వద్దకే వెళ్లి పరీక్షలు చేస్తున్నారు. రోగులకందే సేవల్లో ఎటువంటి జాప్యం ఉండకూడదని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ఏఎంసీలో ఎక్స్‌రేలు తీస్తున్నారు. నవజాత శిశు కేంద్రంలోనూ నెలల పసికందులకు డిజిటల్ ఎక్స్‌రే తీస్తున్నారు. రేడియాలజీ విభాగం పర్యవేక్షణలో పసికందులకు ఎక్స్‌రే ద్వారా నిమోనియా, బ్రాంకైటీస్ తదితర సమస్యలను తెలుసుకుంటున్నారు. కార్పొరేట్ తరహాలో రోగులకు సేవలు అందుతున్నాయి.

– అనంతపురం మెడికల్:



చిన్నారికి ఎక్స్‌రే తీస్తున్న దృశ్యం